నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, ఏప్రిల్ 18: టీఎస్ ఎస్‌పీడీసీఎల్ అజాంబాద్ డివిజన్ పరిధిలోని 11 కేవీ బాపూనగర్, చిక్కడపల్లి, సీఈ కాలనీ, విద్యానగర్, ఆర్టీసీ ఎక్స్ రోడ్, స్పెన్సర్ పీడర్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీ ఈ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు బాపునగర్, సీఈ కాలనీ, చిక్కడపల్లి పీడర్ పరిధిలోని బాపునగర్, నెక్లెస్ హోటల్, ఆకాష్‌నగర్, ఓవైసీ నగర్, చిక్కడపల్లి, వెంకటేశ్వర స్వామి టెంపుల్, బాగ్‌లింగంపల్లి, శివం, సాయిబాబానగర్, శారదానగర్, ఈసేవ, బాగ్ అంబర్‌పేట్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యానగర్, స్పెన్సర్స్, ఆర్టీసీ క్రాస్‌రోడ్ ఫీడర్ల పరిధిలోని రాంనగర్ గుండు, విద్యానగర్, అడిక్‌మెట్, రీసాల, అంబేద్కర్‌నగర్, హరినగర్, అచ్చయ్యనగర్, శివాలయం టెంపుల్, ఎన్‌బీకే ఎస్టేట్, చర్చి గల్లీ, రాజా డీలక్స్ తదితర ప్రాంతాల్లో కరెంటు ఉండదు. ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

కొత్త లిఫ్ట్ ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 18: బాగ్లింగంపల్లి లంబాడ తండా బస్తీలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ భవనంలో కొత్త లిఫ్టు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. 9 అంతస్తులు ఉన్న ఈ భవనంలో తరచూ లిఫ్ట్ చెడిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు పేర్కొన్నారు. ఎన్ని సార్లు మరమ్మత్తులు చేసిన ప్రయోజనం లేకుండా పోయిందని వారు చెప్తున్నారు. శుక్రవారం కాంగ్రెస్ నాయకుడు అరవింద్ కుమార్‌యాదవ్ తండా బస్తీలో పర్యటించారు. స్థానికులు నవీన్‌నాయక్ తదితరులు లిఫ్ట్ సమస్యను పరిష్కరించాలని కోరారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

కొండాపూర్: వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం మాదాపూర్‌లోని శిల్పారామంలో నృత్యకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. న్యూ జెర్సీ నుంచి విచ్చేసిన కూచిపూడి కళాకారిణి నీలిమ రాజు కృష్ణ పంచకం, నారాయణీయం, వీక్షేదా దేవ దేవం ప్రదర్శించారు. సంచలన స్కూల్ ఆఫ్ డాన్స్ నాట్య గురువు పద్మ కల్యాణ్ శిష్య బృందం కూచిపూడి ప్రదర్శనలో మూషిక వాహనం, గంధము పూయరుగా, జనుత శబ్దంలో పలువురు కళాకారులు ప్రదర్శించారు.

నిరుపేదలకు మెరుగైన వైద్యం

- అడ్డగుట్ట, లాలాపేట ప్రభుత్వ దవాఖానల నిర్మాణం త్వరలో ప్రారంభం
- సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు వెల్లడి
- నెరవేరనున్న స్థానికుల చిరకాల స్వప్నం

సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమావేశమైన సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, ఏప్రిల్ 18 : సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో పేదల వైద్య అవసరాలు తీర్చేలా అడ్డగుట్ట, లాలాపేట ప్రాంతాల్లో రెండు 30 పడకల అధునాతన హంగుల ప్రభుత్వ ఆసుపత్రుల నిర్మాణం పనులను త్వరలో ప్రారంభించానున్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ తెలిపారు. తాజాగా అధికారికంగా అన్ని అనుమతులను సాధించామని, త్వరలో పనులను ప్రారంభించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యేతో జిల్లా వైద్య అధికారి డాక్టర్ రాజేంద్రనాద్ నేతృత్వంలోని అధికారుల బృందం సీతాఫల్‌మండిలోని ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో సమావేశమైంది. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ అడ్డగుట్టలోని ప్రస్తుత దవాఖాన పాత భవనాన్ని ఖాళీ చేసి, దానిని కూల్చివేసిన వెంటనే పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. నిజానికి గత ప్రభుత్వ హయంలోనే రాష్ట్ర వైద్య శాఖ ద్వారా జీఓ నంబరు 450 ఆగస్టు 2023 ద్వారా రూ.13.05 కోట్ల మేర నిధుల వ్యయంతో అడ్డగుట్ట ఆసుపత్రి కొత్త భవనాల నిర్మాణానికి తాము అనుమతిని సాధించామని తెలిపారు. ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రాసెస్ పూర్తయినందున, వెంటనే బిల్డింగ్ ఖాళీ చేసి తాత్కాలికంగా ఇతర భవనంలో వైద్యశాలను ఏర్పాటు చేసుకోవాలని వైద్యులకు సూచించామని తెలిపారు. పాత భవనం కుల్చివేసిన వెంటనే కొత్త ఆసుపత్రి నిర్మాణ పనులు వీలైనంత తొందరగా ప్రారంభించాలని సూచించారు. తద్వారా అడ్డగుట్ట ప్రజల చిరకాల స్వప్నాని నేరవేర్చనున్నామని తెలిపారు. అదే విధంగా లాలాపేటలో అర్బన్ కమ్యూనిటీ హెల్త్ కేర్ సెంటర్ ప్రాంగణంలో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిని మంజూరు చేసి, జీఓ నంబరు 449 తేదీ 10 ఆగస్టు 2023 ద్వారా రూ.13.05 కోట్ల మేరకు నిధులు మంజూరు చేసిందని తెలిపారు. దీని టెండర్‌ల ఖరారు ప్రక్రియ పూర్తయ్యిందని పేర్కొన్నారు. ఈ పనులు కూడా వీలైనంత తొందరగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే సీతాఫల్‌మండిలోని కుట్టి వెల్లోడి ప్రభుత్వ సివిల్ ఆసుపత్రి కొత్త భవనాల నిర్మాణం పనులు వేగంగా సాగుతున్నాయని వెల్లడించారు. 70 పడకల సామర్థ్యంతో రూ.12కోట్ల వ్యయంతో ఈ ఆసుపత్రి భవనాల నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అడ్డగుట్ట, లాలాపేట వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కంప్యూటర్ సైన్స్‌లో చెరుకు ప్రభాదేవికి డాక్టరేట్

ప్రభాదేవికి డాక్టరేట్ ప్రదానం చేస్తున్న ఓయూ ఇంజినీరింగ్ కళాశాల అధికారులు

సికింద్రాబాద్, ఏప్రిల్ 18: ప్రతిష్టాత్మక మైన ఓయూలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ నుంచి ఐటీ విభాగంలో చెరుకు ప్రభాదేవికి డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ప్రొఫెసర్ వీబీ నరసింహ పర్యవేక్షణలో 'ఐడెంటిటీ అండ్ యాక్సెస్ మేనేజ్‌మెంట్ ఇన్ పబ్లిక్ క్లౌడ్ ప్రేమ్ వర్క్స్' అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకు ఓయూ గెజిట్ ద్వారా ప్రభాదేవికి డాక్టరేట్ ప్రకటించారు. చిన్ననాటి నుంచే చదువులో చురుకుగా ఉండే ప్రభాదేవి ఉన్నత ఆశయంతో పీహెచ్‌డీలో ప్రవేశం పొంది తన లక్ష్యాన్ని పూర్తి చేశారు. సూర్యాపేట జిల్లా, తిరుమలగిరి మండలం, తాటిపాముల గ్రామానికి చెందిన ప్రభాదేవిది వ్యవసాయ కుటుంబం. తండ్రి చెరుకు సోమయ్య ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ డైరెక్టర్. తల్లి కలమ్మ గృహిణి. ఓయూ నుంచి డాక్టరేట్ సాధించడం పట్ల అధ్యాపకులు, భర్త దాసరి నారాయణ, సోదరుడు చెరుకు యాకస్వామి, మిత్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమెను ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్లు, కోస్కాలర్స్ ఘనంగా సన్మానించారు. ప్రభాదేవి మాట్లాడుతూ పీహెచ్‌డీ సాధించేందుకు సహకరించిన గైడ్ ప్రొఫెసర్ వీబీ నరసింహ, హెచ్‌ఓడీ పీవీ సుధ, ప్రొఫెసర్ శ్యామల, ప్రొఫెసర్ వెంకటదాస్, గురువులకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నారులకు వేసవి శిబిరం ప్రారంభం

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 18: చాచా నెహ్రూ నగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రెయిన్‌బో కమ్యూనిటీ కేర్ లెర్నింగ్ సెంటర్‌లో ఉచిత వేసవి శిబిరం ప్రారంభించారు. రెయిన్‌బో హోమ్స్ జాతీయ బాలల ప్రోగ్రాం, ఫైనాన్స్ విభాగం ప్రతినిధి నిరంజన్‌రెడ్డి హాజరయ్యారు. పిల్లల భవిష్యత్‌కు బలమైన పునాది వేయడమే లక్ష్యంగా, రెయిన్ బో ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా పిల్లల కోరిక మేరకు లెర్నింగ్ సెంటర్ కోసం ఆయన తండ్రి వెంకట్‌రెడ్డి జ్ఞాపకార్థంగా ఒక నూతన ఎయిర్ కూలర్‌ను విరాళంగా అందజేశారు. దీనిపై పిల్లల తల్లిదండ్రులు, సంరక్షకులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. నిరంజన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. రెయిన్ బో హోమ్స్ బాలల ప్రోగ్రామ్ డైరెక్టర్ శ్రీలత మోరాంపూడి మాట్లాడుతూ ఈ వేసవి శిబిరంలో పిల్లల కోసం విద్యా ఆటలు, జీవన నైపుణ్యాలు, ఆరోగ్య, పరిశుభ్రతలపై ప్రత్యేక తరగతులను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెయిన్‌బో హోమ్స్ పర్సన్ ఇన్‌చార్జి సుజాత, సిటీ డెస్క్ మేనేజర్ క్రాంతి కిరణ్, సీబీసీ కోఆర్డినేటర్ సంధ్యారాణి, టీచర్ వెంకటలక్ష్మి, ఆరీఫ్, సుధారాణి చల్లా, సురేష్, శివకుమార్, అశోక్, బస్తీ నాయకుడు విజయ్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

చాచానెహ్రూనగర్‌లో వేసవి శిబిరం ప్రారంభించిన రెయిన్ బో హోమ్స్ ప్రతినిధులు

మైసమ్మ తల్లి దీవెనలు అందరిపై ఉండాలి

మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడ్‌పల్లి, ఏప్రిల్ 18: మైసమ్మతల్లి చల్లని దీవెనలు ప్రజలందరిపై ఉండాలని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని రేతిఫిల్ గంజ్‌లో గల రైల్వే క్వార్టర్స్ ప్రాంతంలో జ్యూవెల్లరీ వ్యాపారి మహేందర్ నికుంజ్ సహకారంతో నూతనంగా నిర్మించిన మైసమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, ఆలయ కమిటీ సభ్యులు నగ్మా మాలకమ్మ, పప్పి మాలకమ్మ, ఆర్తి మాలకమ్మ, గౌరినాయక్, శృతినాయక్, మోండా, బన్సీలాల్‌పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఆకుల హరికృష్ణ, వెంకటేషన్‌రాజు, నాయకులు నాగులు, జయరాజ్, మహేష్ యాదవ్, శ్రీనాథ్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణను ఉపసంహరించాలి



వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా సనత్‌నగర్‌లో సాగిన ర్యాలీ

అమీర్‌పేట్, ఏప్రిల్ 18: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ముస్లింలు శుక్రవారం సనత్‌నగర్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. జామై నిజామియాకు చెందిన ముఫ్తీ అన్వర్ అహ్మద్ పాటు జామా మసీద్ జాఫ్రీ సనత్‌నగర్ అధ్యక్షుడు సయ్యద్ నొమానుద్దీతో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహ్మద్ సలీమ్‌ఖాన్ సహా వివిధ పక్షాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. ర్యాలీ శుక్రవారం మధ్యాహ్నం ప్రార్థనల అనంతరం సనత్‌నగర్ జామా మసీద్ జాఫ్రీ దగ్గర మొదలై మార్కెట్ రోడ్డులోని కూబా మసీదు మీదుగా సనత్‌నగర ప్రధాన రహదారి, డీ మార్ట్ మీదుగా సనత్‌నగర్ బస్టాండ్‌కు చేరింది. ముస్లిం సోదరులు పెద్దసంఖ్యలో ఈ ర్యాలీలో పాల్గొని బీజేపీ ప్రవేశపెడుతున్న నల్ల చట్టాలపై తమ నిరసన తెలిపారు

'కొత్త చట్టంతో భూ వివాదాలు పరిష్కారం'

మేడ్చల్ కలెక్టరేట్, ఏప్రిల్ 18: నూతన ఆర్ఓఆర్ చట్టం భూవివాదాల పరిష్కారాలను సరళతరం చేయడానికి దోహద పడుతుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. భూవివాదాల సత్వర పరిష్కారానికి 'భూ భారతి' అవగాహన సదస్సులు ఉపయోగపడతాయన్నారు. చట్టంలోని నిబంధనలపై అవగాహన తీసుకురావడానికి, సేవలను విస్తరించడానికి పౌరులు, రైతులు, రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులతో అవగాహన సదస్సులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. మండల స్థాయిలో ఈ నెల 19 నుంచి 26 వరకు సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. 19న మూడుచింతలపల్లి మండలం కేశవరంలో ఉదయం 10.30 గంటలకు అవగాహన సదస్సు నిర్వహి స్తున్నట్లు తెలిపారు.

సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం


కందుకూరి వీరేశలింగం చిత్రపటానికి నివాళులర్పించిన ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

ముషీరాబాద్, ఏప్రిల్ 18: కందుకూరి వీరేశలింగం గొప్ప సంస్కర్త, ప్రముఖ బహుముఖ ప్రజ్ఞాశాలి అని పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో కందుకూరి వీరేశలింగం పంతులు యాదిలో భాగంగా సంస్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని కందుకూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుజాతి నవయుగ వైతాలికుడు వీరేశలింగం పంతులు అని, స్త్రీ విద్య కై ఉద్యమించి, ప్రచారం చేశారని అన్నారు. మగపిల్లలతో సహా ఆడపిల్లలు చదువుకోవాలని సహవిద్యా విధానాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జయ రాములు, శ్రీమణి, బమిడి ఉష తదితరులు పాల్గొన్నారు.

ప్రోస్టేట్ సమస్యల పట్ల నిర్లక్ష్యం తగదు

వయోధికులకు ప్రోస్టేట్ సమస్యలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ గోపాల్ రాందాస్

అమీర్‌పేట్ , ఏప్రిల్ 18 : వయోభారం పెరుగుతున్న దశలో తలెత్తే ప్రోస్టేట్ సమస్యలను నిర్లక్ష్యం చేయడం మంచిది కాదని కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ గోపాల్ రాందాస్ తక్ పేర్కొన్నారు. ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్ఆర్‌నగర్ వయోధికుల మండలి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ గోపాల్ రాందాస్ తక్ వయోధికులు ఎదుర్కొంటున్న ప్రోస్టేట్ గ్రంధుల సమస్యలకు పరిష్కారమార్గాలు సూచించారు. సహజంగా వయసు పైబడుతున్న దశలో వృద్ధుల్లో ప్రోస్టేట్ ఆరోగ్య సమస్యలు తలెత్తడం సహజమని, ఈ సమస్యను సకాలంలో గుర్తించడం ఎంతో ముఖ్యమన్నారు. వయోధికుల్లో సాధారణంగా తలెత్తే మూత్ర సంబంధ సమస్యలు ప్రోస్టేట్ ఆరోగ్య సమస్యల కారణంగా ఏర్పడినవేనా అనే విషయాన్ని పీఎస్ఏ, అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షల ద్వారా నిర్ధారణకు రావాల్సి ఉంటుందని, ప్రోస్టేట్ సమస్యలున్న వారు తీసుకోవాల్సిన డైట్ గురించి వయోధికులకు అవగాహన కల్పించారు. వయోధికులు ప్రతియేటా క్రమం తప్పకుండా ఈ పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రోస్టేట్ సమస్యను సకాలంలో గురించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వయోధికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఖైరతాబాద్, ఏప్రిల్ 18: అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకున్నది. పుట్‌పాత్‌పై నివాసం ఉంటూ పలు ఫంక్షన్‌హాళ్లలో కూలీ పనులు చేసుకొని జీవిస్తున్న మహేశ్ (35) గురువారం కూలీ పని కోసం ఫంక్షన్‌హాల్‌కు వెళ్లాడు. అక్కడే పడుకున్నాడు. తోటి కూలీ మహ్మద్ జాఫర్ వచ్చి నిద్ర లేపేందుకు ప్రయత్నించగా, స్పందించ లేదు. చలనం లేకపోవడంతో స్థానికుల సాయంతో పోలీసులతో పాటు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ సిబ్బంది పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మహేశ్ మృతికి కారణాలు తెలియరాలేదు. జాఫర్ ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

క్రీస్తును శిలువ వేసే ఘట్టంలోని దృశ్యం

అమీర్‌పేట్, ఏప్రిల్ 18: గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని సనత్‌నగర్ సెయింట్ థెరస్సా చర్చి ఆధ్వర్యంలోని యూత్ ఫర్ క్రైస్ట్ సభ్యులు క్రీస్తును శిలువ వేసే ఘట్టాన్ని ప్రదర్శించారు. 70 మంది యూత్ సభ్యులచే గంటపాటు ఈ ఘట్టం ఆద్యంతం భక్తి భావంతో సాగింది. యేసు క్రీస్తుగా ఆంథోని, మేరీ మాతగా ప్రియాంక, హై ప్రీస్ట్‌గా ఐవనో వాజ్, ప్రీస్టుగా రాజారావు, జోజిబాబు తమ పాత్రలను పోషించారు. రాబ్లిన్ రోచ్ దర్శకత్వ పర్యవేక్షణలో కొనసాగిన ప్రదర్శనకు క్రైస్తవులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

బోయిగూడ చర్చిలో ప్రార్థనలు..

బన్సీలాల్ పేట్: గుడ్ ఫ్రైడే సందర్భంగా న్యూబోయిగూడలోని 'సెయింట్ జాన్ మరియా వియాన్నే' చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. ఏసు ప్రభువు సిలువను మోసిన ఘట్టాన్ని లాజరస్ జోసెఫ్ ఆకట్టుకునేలా ప్రదర్శించాడు. ఫాదర్ ప్రతాప్ పారిష్ ప్రార్థనలు నిర్వహించారు. సభ్యులు లాజరస్, మెర్సీ అంథోని, జాకోబ్, డేవిడ్, అరుల్‌రాజ్, సవియో, అవేర్, నోవెల్, సహాయ ఫాదర్ నరేష్ పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే..

ముషీరాబాద్: ముషీరాబాద్ ప్రేయర్ పవర్ చర్చిలో జరిగిన గుడ్ ఫ్రైడే వేడుకల్లో ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రార్థనల్లో పాల్గొన్నారు.


బొల్లారం హోలీ ట్రినిటీ చర్చిలో భక్తులకు సందేశం ఇస్తున్న పాస్టర్ చార్లెస్ వెస్లీ

బోయిగూడలోని చర్చిలో గుడ్ ఫ్రైడే ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

బొల్లారం, ఏప్రిల్ 18: కంటోన్మెంట్‌లోని పలు ప్రార్థన మందిరాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. బొల్లారం హోలీ ట్రినిటీ చర్చి లో ప్రార్థనలు రెవ.పాస్టర్ చార్లెస్ వెస్లీ ఆధ్వర్యములో జరిగాయి. అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు. చర్చి కమిటీ ప్రధాన కార్యదర్శి సుందర్‌రావు పాల్గొన్నారు. తిరుమలగిరి గారిసన్ వెస్లీ చర్చిలో రేవ.రాజేశ్వర్ సాల్మోన్ ప్రార్థనలు జరిగాయి. కోశాధికారి పులి గాబ్రియేల్, ప్రధాన కార్యదర్శి క్లమంట్ రవి రాజు పాల్గొన్నారు. లైఫ్ చేంజింగ్ రివైవల్ సెంటర్ చర్చి పీజే స్టీఫెన్ పాల్ ఆధ్వర్యంలో క్రీస్తు ప్రేమ, త్యాగం సోదరభావంపై సందేశాన్ని అందించారు.

ముషీరాబాద్: ముషీరాబాద్ ప్రేయర్ పవర్ చర్చిలో జరిగిన గుడ్ ఫ్రైడే వేడుకల్లో ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రార్థనల్లో పాల్గొన్నారు.

ఫోన్ చూడటం తగ్గించుకోవాలన్నందుకు..

బంజారాహిల్స్, ఏప్రిల్ 18: ఎప్పుడు చూసినా సోషల్ మీడియాలో ఉంటున్నావంటూ తల్లిదండ్రులు మందలించడంతో బాలిక ఇంట్లోంచి వెళ్లిపోయిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని సయ్యద్‌నగర్‌లో నివాసం ఉంటున్న బాలిక(16) ఏడో తరగతిలో చదువు ఆపేసి ఇంట్లోనే ఉంటోంది. కొన్నేండ్లుగా ఇన్‌స్టాగామ్, స్నాప్ చాట్, వాట్సాప్ తదితర సోషల్ మీడియాలో అకౌంట్స్ పెట్టుకున్న బాలిక ఎప్పుడు చూసినా చాటింగ్ చేస్తుండడంతో పాటు వీడియోలు చూస్తోంది. విషయాన్ని గుర్తించిన తల్లిదండ్రులు పలుమార్లు నిలదీసినా అలవాటు మానుకోలేదు. ఈ క్రమంలో రెండ్రోజుల క్రితం మరోసారి కుటుంబ సభ్యులు సోషల్ మీడియా తగ్గించుకోవాలంటూ హితవు పలికారు. దీంతో బాలిక ఎవరికీ చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోయింది. ఈ మేరకు బాలిక కుటుంబ సభ్యులు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఉద్యమకారుల ప్లీనరీ పోస్టర్ ఆవిష్కరణ

తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సికింద్రాబాద్, ఏప్రిల్ 18: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహించే ప్లీనర్ కి రావాలని పలువురు నాయకులను ఆహ్వానించారు. రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆదేశానుసారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు తదితరులను కలిసి ఈ నెల 21న సీతాఫల్‌మండి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో జరగబోయే తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీకి ఆహ్వానించారు. అనంతరం ప్లీనరీకి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లూరి అనిల్‌కుమార్, గ్రేటర్ కన్వీనర్ జగన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయం వార్షికోత్సవాలు


పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న వినయ్ కుమార్, తదితరులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 18: గాంధీనగర్ డివిజన్ చిక్కడపల్లి బాపునగర్‌లోని రాజరాజేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారి 41వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం పూజల అనంతరం సాయంత్రం ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది.బీజేపీ సికింద్రాబాద్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ పాల్గొన్నారు. శనివారం శివపార్వతుల కల్యాణం తదనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆలయ అర్చకుడు ఎం. ఆనంద్‌స్వామి పేర్కొన్నారు. కార్యక్రమాన్ని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు వి.నవీన్ కుమార్, రత్నసాయి చంద్, దామోదర్, శ్రీకాంత్, పి.నర్సింగ్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు అంబోల్ రాజు, మహేష్, సాయి పాల్గొన్నారు.

పక్షులకు నీటి తొట్లు ఏర్పాటు

పక్షులకు, ఇతర మూగ జీవాలకు ఎండాకాలంలో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు అత్తాపూర్ డివిజన్ చింతకుంట పార్క్ వాకర్స్ శ్రీకారం చుట్టారు. ప్రముఖ జ్యోతిష్య ఎం.లక్ష్మణ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛందంగా నీటి తొట్లు, వాటర్ పాట్స్, విస్తృతంగా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మధుసూదన్, ప్రజా సంఘాల ప్రతినిధులు, వాకర్స్ నల్లింగ్ రమేశ్, సుబ్బరాజు, జైతారం జగన్మోహన్‌రెడ్డి, నర్సింహులు, బీట్కూరి సతీష్, సురేందర్, మల్లేష్, గణేష్, ఎం.సుధాకర్ పాల్గొన్నారు. – మైలార్‌దేవ్‌పల్లి